

# కథ కాని కథ

బెహరా వెంకట సుబ్బారావు

"సుగుణకి సీరియస్‌గావుంది-వెంటనే రావలెను"- శంకరం. విశాఖపట్నం నుంచి శంకరం యిచ్చిన టెలిగ్రాం అందుకొని, ఆఫీసుకి నాలుగురోజులు శలవు పెట్టి వెంటనే బయలుదేరాను.

శంకరం నా ఆఖరి బావమరిది. వాళ్ళది విశాఖపట్నం. సంక్రాంతికి శలవు లీయగానే నాభార్య సుజాత పిల్లల్ని తీసుకొని పుట్టింటికి విశాఖపట్నంవెళ్ళింది. వెళ్లిన వెంటనే లెటరు రాసింది. తన చెల్లెలు సుగుణకి వారం రోజుల నుంచీ సుస్తీగావుందని రాసింది, గానీ ఆ సుస్తీ ఏమిటో వివరంగా రాయలేదు. రెండు సంవత్సరాలనుంచీ సుగుణ తరచుగా అనారోగ్యానికి గురౌతూనేవుంది.

మామగారు విశాఖపట్నం కలక్టరాఫీసులో యూ. డి. సిగా పనిచేసేవారు. ఆయనకు ఆరుగురు సంతానం. భాస్కరం, కృష్ణ, సుజాత, లక్ష్మి, ఆఖరువాడు శంకరం. భాస్కరం భిలాయ్ స్టీల్‌ప్లాంట్‌లో అకౌంటెంటు. అతనికిద్దరు పిల్లలు. రెండో వాడు కృష్ణ. ఖరగ్‌పూర్‌లో రైల్వేలో పని చేస్తున్నాడు. అతనికి ముగ్గురు సంతానం. ఆఖరివాడు శంకరం. గ్రాడ్యుయేట్! నిరుద్యోగి! మామగారు బతికున్నరోజుల్లోనే భాస్కరానికి, కృష్ణకి, సుజాతకి పెళ్ళిళ్ళు చేసారు. పెద్దబ్బాయి భాస్కరానికి వచ్చిన కట్నంతో సుజాతని నాకిచ్చి వివాహం చేసారు. రెండో వాడు కృష్ణకి వచ్చిన కట్నంతో సుగుణకి పెళ్ళిచేద్దామనుకొన్నారు కానీ అలా జరగలేదు.

మా అత్తగారికి ఏకైక సోదరుడు సుందరం! వాళ్ళది అమలాపురం. చాలాకాలం అంటే సుమారు పది సంవత్సరాలు వీళ్ళతో సంబంధంలేనట్లు ప్రవర్తించాడు. కాంట్రాక్టర్‌గా చాలా డబ్బు సంపాదించాట్ట! మరొక యిద్దరు పార్టనర్స్‌ని కుదుర్చుకొని లక్షలమీద కాంట్రాక్టులు చేస్తున్నాట్ట! అయితే ఆ పార్టనర్స్ చేసిన మోసం వల్ల లక్షరూపాయలు నష్టపోయాట్ట! ఆ దెబ్బనుండి తేరుకోలేకపోయాట్ట! అకస్మాత్తుగాఒకనాడు అక్కగారింటికి విశాఖపట్నం వచ్చాడు. తన కూతుర్ని రెండో కోడలుగా చేసుకోమని అక్కని బ్రతిమాలాడు. తమ్ముడంటే మంచి అభిప్రాయం లేదుఅక్కకి.

"ఇన్నాళ్ళకి పిల్లలు ప్రయోజకులయ్యాక మేం గుర్తుకొచ్చామా? ఇన్నాళ్ళు తెంచుకొన్న సంబంధాన్ని యిప్పుడు మళ్లీ కలుపుకోడానికి వచ్చావా?"అంటూ దెప్పి పొడిచింది అక్క. అక్క కాళ్లమీద పడి ప్రాధేయపడ్డాడు సుందరం.

"నా మేనకోడలు సుగుణకి మంచి సంబంధం చూసి పెళ్ళిచేసే పూచీనాది!" అని భరోసా యిచ్చాడు. వాగ్దానం చేసాడు.

మొదట్లో అంగీకరించకపోయినా పుట్టింటిమీదున్న మమకారంకొద్దీ సరే అంది అక్క. మామగారుకూడా అంగీకరించారు. లాంఛనాలు మాత్రం ఘనంగా యిచ్చి కానీ కట్నం లేకుండా తన కూతుర్ని మేనల్లుడు కృష్ణకిచ్చి పెళ్ళి చేసాడు సుందరం. రెండో కొడుక్కి కట్నం రాలేదు కాబట్టి సుగుణ పెళ్ళి వాయిదా పడింది. ఆ తర్వాత మూడేళ్ళకి అంటే యింకా అయిదేళ్ళు సర్వీసుండగానే మామగారు పోయారు. ప్రావిడెంట్ ఫండూ గ్రాట్యుయిటీ వగైరాలు అన్నీ కలిపి ముప్పయివేలు వచ్చాయి. మామగారు చేసిన కొన్ని బాకీలు తీర్చారు. కర్మ కాండకీ రోజులకీ కొంత ఖర్చయింది. చాలాకాలం క్రిందట చవక రోజుల్లో గాజువాక దగ్గర ఆరు వందల గజాలు జాగా కొన్నారు మామగారు. 'అయితే యిల్లు కట్టలేకపోయారు.

"ఆ జాగాలో తాటాకు యిల్లయినా కట్టుకోండి! అద్దె బాధ తప్పుతుంది. బావగారి కోరికా తీరుతుంది!" సలహా యిచ్చాడు సుజాత మేనమామ సుందరం. ఆ సలహా అందరికీ నచ్చింది. ఆ జాగాలో తాటాకు యిల్లు కట్టారు. అందులోకి మకాం మార్చారు. అన్ని ఖర్చులూ పోగా పదివేలు మిగిలింది. ఆ డబ్బుతో సుగుణ పెళ్ళి చేయాలనుకొంది తల్లి. మూడు నాలుగు సంబంధాలు చూసారు. ఒకటి వారికి అందుబాటులో లేదు. కట్నాల రేటు బాగాపెరిగి పోయింది.

"సుగుణ పెళ్ళి గురించి బెంగపడకమ్మా! మంచి సంబంధం చూసి చేస్తాం!" అని పెద్ద కొడుకు లిద్దరూ హామీ యివ్వడంతో సంతృప్తి చెందింది తల్లి. తర్వాత తమకేవో ఇబ్బందులూ ఖర్చులూ వున్నాయని చెప్పి తలొక వెయ్యి రూపాయలూ తీసుకొన్నారు. తర్వాత యిస్తామన్నారు.

"మిగిలిన డబ్బుతో యిల్లు గడుపుకొంటే దాని పెళ్ళి ఎలా చేస్తార్రా?" అడిగింది తల్లి. నెలనెలా తలొక నూటయాభై పంపుతామని వాగ్దానం చేసారు యిద్దరూ. తన పెన్షన్ వందా కలిపితే మొత్తం నాలుగొందలవుతాయ్ ఎలాగో లాగు గడుపుకోవచ్చనుకొంది తల్లి. ఆ డబ్బు ముట్టుకోకూడదని నిశ్చయించుకొంది. కానీ అనుకొన్నట్టు జరుగలేదు. పిల్లలిద్దరూ నాలుగు నెలలపాటు నూరూ, నూటయాభై పంపేవారు. ఆ తర్వాత అసలు పంపడం పూర్తిగా మానేసారు. బ్యాంకులో వున్న డబ్బు యింటి ఖర్చులకివాడక తప్పిందికాదు. సంవత్సరంగడిచింది. తండ్రి సంవత్సరీకాలకి అందులోనే మరికొంత డబ్బు ఖర్చు చేసారు. సంవత్సరీకాలకి అంతా వచ్చేరు. అందరూ అలా ఒక సారి కల్సుకొనే అవకాశం చాలా అరుదుగా వస్తుంది. అందుకే చెల్లిలు పెళ్ళి విషయం యెత్తింది నాభార్య సుజాత. అదిగో యిదిగో అంటూ దాటవేసారు అన్నయ్యలిద్దరూ. అంటీ అంటనట్టుగా ప్రవర్తించి వెళ్ళేడు మేనమామ సుందరం.

సంవత్సరాలు గడుస్తున్నాయ్. పిల్లల వయసులూ పెరుగుతున్నాయ్. ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు కాలేదు! కొడుకులిద్దరూ నిర్లక్ష్యంగానూ బాధ్యతారహితంగాను ప్రవర్తిస్తున్నారు. బ్యాంకు బేలెన్స్ వందల్లోకి చేరుకొంది. ఆఖరి అబ్బాయి శంకరానికి వుద్యోగం రాలేదు. అత్తయ్యగార్ని బెంగ కృంగతీస్తోంది. శంకరం పిల్లలకి ట్యూషన్లు చెప్పి నూటయాభై సంపాదిస్తున్నాడు. అత్తగారి పెన్షన్ వందా. ఆ డబ్బు ఏమాత్రం సరిపోతుంది?


"పిల్లల్ని కంటాం! వాత్సల్యంకొద్దీ పెంచి పెద్దచేసి ప్రయోజకుల్ని చేస్తాం! ఆఖరి దశలో ఆదుకొంటారని ఆశించడం వట్టి అవివేకమే అవుతుందోయ్!" తన ఆవేదనను వ్యక్తం చేసింది అత్తయ్యగారు అనేకసార్లు.


పెద్దబ్బాయి భాస్కరం కనీసం ఏడాదికోసారైనా అత్తవారింటికి అనకాపల్లి వెళ్తాడు పెళ్లాం పిల్లల్తో. దారిలో వైజాగ్‌లో దిగి తల్లినీ చెల్లెళ్ళనీ చూడడు! తిరుగు ప్రయాణంలో మాత్రం వెళ్తాడు. అతి కష్టం మీద ఒక పూట వుంటాడు. (రైలులో బెర్తుల రిజర్వేషన్ కోసం దిగుతా డంటుంది సుజాత) మరొకపూట వుండమంటే శలవు లేదంటాడు. ఉన్న ఆ ఒక్క పూటలోనూ కోడలు తమ గొప్పల్నీ, అంతస్తునీ వర్ణించుకొంటుందేతప్ప అత్తగారూ ఆడబడుచులూ మరిదీ ఎలా కాలక్షేపం చేస్తారన్న విషయం పట్టించుకోదు. పిల్లల కాన్వెంటు చదువుల గురించీ, తమ యింట్లోవున్న టీ. వీ, ఫ్రిజ్, లాంబ్రెట్టాల గురించీ మాట్లాడ్తుంది. అలా ఆ పూట గడిచిపోతుంది. కనీసం భాస్కరం అయినా వారి యోగక్షేమాలు అడిగి తెల్సుకోడు. తర్వాత రైలెక్కేస్తారు.

ఇక రెండో అబ్బాయి కృష్ణ. అన్నయ్య చదివిన బడిలోనే చదివాడు. రైల్వేలో వుద్యోగం కాబట్టి పాసులుంటాయి. తరుచుగా అంటే సంవత్సరానికి మూడు సార్లైనా అత్తగారింటికి కుటుంబ సహితంగా అమలాపురం వెళ్తాడు తిన్నగా. అలాగే తిరుగు ప్రయాణంకూడా! డైరక్టుగా ఖరగ్‌పూరు పోతారు. (వాల్తేరు స్టేషన్‌లో నలభై అయిదు నిమిషాలు బండి ఆగినప్పుడైనా తల్లి గుర్తుకు రానందుకి ఆశ్చర్యపోతుంది సుజాత). ఏ మూడో ట్రిప్పులోనో నాలుగో ట్రిప్పులోనో తల్లి దగ్గరకు వెళ్తాడు. అదికూడా తిరుగు ప్రయాణంలో!

తన పుట్టింటివారి హోదా గురించీ, తాను చేయించుకొన్న నగల గురించీ, పాసుల మీద తాము తిరిగిన ప్రదేశాల గురించీ, యాత్రల గురించీ ఏకరవు పెడ్తుంది రెండో కోడలు. మేనత్తకదా అని మాట వరసకి మధ్యలో అంటుంది పూరించినట్టుగా "వచ్చే డిశంబరులో కన్యాకుమారి వెళ్తున్నాం. అప్పుడు మీరుకూడా తప్పకుండా రావాలత్తయ్యా!" అని. "అలాగే" అంటుందామె. ఎన్నో డిశంబర్లు వస్తున్నాయ్! పోతున్నాయ్!

తమ యిబ్బందుల్నీ, కష్టాల్నీ కొడుకుల్తో చెప్పుకోవాలని వారు రాకముందు ఎన్నోసార్లు అనుకొంటుంది తల్లి. తీరా వాళ్ళు వచ్చాక మాట్లాడ్డానికే వీలుచిక్కదు! చిక్కినా మాట్లాడలేదు! ఎప్పుడైనా సుజాత కలవడం తటస్థ పడితే గట్టిగా కడిగి వదిలిపెడ్తుంది. అందుకే పెద్ద చెల్లి అంటే వాళ్ళకి కోపం! తల్లిని చూడ్డానికే వెళ్ళని వాళ్ళు చెల్లింటికి





వస్తారా? అందుకే మా యింటికెప్పుడూ రారు!

ఇక నా సంగతి! రాజమండ్రి కాలేజీలో లెక్చరర్‌ని. బరువు బాధ్యత లేవీ లేవు. అన్నదమ్ములం ముగ్గురవూ వుద్యోగాలు చేసు కొంటున్నాం. ఎవరి బ్రతుకు వారు బ్రతుకు తున్నాం. ఇద్దరు చెల్లెళ్ళకి వివాహాలయాయ్! నా కిద్దరే పిల్లలు! ఎంత విలాసంగా ఖర్చు చేసినా కొంత మిగుల్తుంది. వారికి సహాయంచే ద్దామన్నా అత్తయ్యగారు అంగీకరించదు. ఒక సారి సుజాత ఇద్దరు చెల్లెళ్ళకీ తల్లికీ చీరలు కొని తీసుకెళ్ళింది.

"ఆడ పిల్లవి! నీకు పెట్టేది పోయి నీ దగ్గర తీసుకొంటామా! తిరిగి పంపితే నీ మొగుడు బాధ పడ్తాడు. ఇలా ఎప్పుడూ తేకు!" అని కూతుర్ని మందలించింది.

సుజాతనీ, పిల్లల్నీ వాళ్ళింటికి పంపా లని వుండదు! పుట్టింటి మీద మమకారం కొద్దీ సంవత్సరానికోసారైనా వెళ్తానంటుంది సుజాత.

"పుట్టింటివారు చారూ అన్నం పెట్టినా పంచభక్ష్య పరమాన్నంతో సమానమండీ! ఆడ పుట్టుక పుడితే మీకు తెలిసి వుండేది" అని సుజాత బతిమాలుతుంటే కాదనలేను. అది నా బలహీనత. పోయిన దీపావళికి ముందు ఇంటర్వ్యూకి బెజవాడ వెళ్ళి తిరుగు ప్రయాణంలో రాజమండ్రిలో దిగాడు శంకరం. అప్పటికి దీపావళి వారంరోజులుంది. పండక్కి విశాఖపట్నం రమ్మని మమ్మల్ని ఆహ్వానిం చాడు. ప్రత్యేకంగా పండగకి వెళ్ళడం ఇష్టం లేదు నాకు.

"మాకు పెళ్ళయి పదేళ్ళయింది. ఇంకా పండగలకి అత్తవారింటికెళ్ళడం యిష్టంలే దోయ్!" మనసులో మాట చెప్పా!

"అమ్మ మరీమరీ చెప్పిందటండి! మిమ్మల్ని చూసి చాలా కాలం అయిందట! దానికి వయసు మళ్ళింది! వచ్చే ఏడాది ఎలా వుంటుందో! మీరు కూడా రాక తప్పదు!" పట్టు పట్టింది సుజాత. మౌనం వహించాను ఆ క్షణంలో.

శంకరం మా పెద్దబ్బాయిని తీసుకొని యిన్నీసుపేట వెళ్ళాడు తన స్నేహితుడిం టికి. అప్పుడు సుజాతకి నచ్చజెప్పడానికి ప్రయ త్నించా.

"మనం పండక్కి వెళ్లామనుకో! కూతురూ అల్లుడూ వచ్చారని భారీ ఎత్తున పండగ చేస్తారు. ఆ తర్వాత అవస్థలు పడ్తారు. మనక్కూడా రానూపోనూ ఖర్చులు! ఎవరు తిన్నదీ కాదు!...ఆ..." మధ్యలో అందుకొని విసుక్కొంది సుజాత.

"మీరొట్టి డబ్బు మనుషులండి! పైసా తోసహా లెక్కలు వేస్తారు!"

"అవును ఏదైనా పని చేయబోయే ముందు ఎంత ధనం వ్యయం అవుతుందీ, ఎంత టైము వేస్టవుతుందీ, ఎవరెవరికి నష్టమూ యిబ్బందులూ కలుగుతాయీ ఇవన్నీ ఆలోచించాలి!"

"వాళ్ళు అప్పుచేయాల్సిన అవసరం వుండ దులెండి! పెద్దన్నయ్య దీపావళికి భిలాయ్‌నుండి వస్తున్నానని రాసాట్ట! వచ్చేటప్పుడు అందరికీ బట్టలు తెస్తానని కూడా రాశాట్ట! శంకరానికి ఏదో కంపెనీలో చిన్న ఉద్యోగం దొరికిం దిట! ఆరు వందలు ఇస్తారుట! మా పెద్ద మేనకోడల్ని పెద్దమనిషయాక అసలు చూడ నేలేదండి!" ప్రాధేయపడింది.

సరే అనక తప్పలేదు! తమ్ముడితో పిల్లల్ని తీసుకొని వెళ్లింది సుజాత. పండగ ముందు రాత్రి నేను కూడా వెళ్లా! అనుకొ న్నట్టుగా భాస్కరం పండక్కి రాలేదు. ఏదో అవాంతరం వచ్చిందని లెటరు రాసాడు. పండక్కి మాకందరికీ బట్టలు కొన్నాడు శంకరం. శంకరం నాకు బట్టలు అందిస్తూంటే ఓ మాట విసిరింది నా ఆఖరి మరదలు లక్ష్మి.

"బావగారు మరీ వంటెత్తు మనుషులు!" అని.

ఆ మాటలలో ఎంతో అర్థం స్ఫురిం చింది. అయితే ఆమె నవ్వుతూ అనడంతో ఈజీగా తీసుకోవలసి వచ్చింది. నా ముఖ కవళికలను గమనించిన అత్తయ్యగారు తేలికగా విడమరచి చెప్పింది.

"చూశావా బాబూ! నీ చిన్న మరదలు ఎంత గడుసుదో! కాలేజీలో చదువుతోంది కదూ! తోటి అల్లుణ్ణే తేకుండా ఒక్కడివే తీసుకుంటున్నావని అంటోంది! అదీ దాని వుద్దేశం!"

"ఆ ప్రయత్నంలోనే వున్నానండి! ఈ మధ్య ఓ సంబంధం చూశాం!..." చెప్ప బోయా.

"అవును బాబూ! సుజాత చెప్పింది! అల్లుడు అబ్బాయితో సమానం అన్న మాటను రుజువు చేస్తున్నావ్! మంచిరోజు చూసి పెళ్లి చూపులకు తీసుకొనిరా!" అంది.

"వాళ్లిదివరలో నాలుగైదు సంబంధాలు చూశారండి! ఒక్కటీ నచ్చలేదుట! అనవ సరంగా తిరగడమవుతోందనే అభిప్రాయంతో వున్నారు.!అందుకని..." తర్వాత సుజాత అందుకుంది.

"అవునమ్మా! అందుకే సుగుణని మాతో తీసుకువెళ్తాం! అక్కడే పెళ్లి చూపులు ఏర్పాటుచేస్తాం!"

"వద్దు బాబూ! పెళ్లికావలసిన పిల్లని అలా వూరూరా తిప్పకూడదు!" అసమ్మ తిని తెలియజేసింది అత్తగారు. తల్లి విధిం చిన ఆజ్ఞకు తల్లడిల్లింది సుగుణ. ఆమె మొహంలో వ్యక్తం అయిన భావాల్ని బాగా చదవగలిగా. లక్ష్మి, శంకరం కూడా తల్లిని చికాగ్గా చూశారు. సుజాత సంగతి సరేసరి!

నేనే నచ్చజెప్పాలనుకొన్నా-

"ఇప్పుడిది మామూలే అయిందండీ! మగపెళ్లివారి అభీష్టానుసారం ఆడపెళ్లివారు

## "కథ కాని కథ"

నడుచుకోక తప్పదు! పాత పద్ధతుల్ని పట్టు కొని వేళ్లాడితే పనులు కావు!"

"ఆడపిల్ల వారింటికి మగపెళ్లివారు రావడం ఆచారం బాబూ! అలా వచ్చి నపుడు ఆడపెళ్లివారి హోదానీ అంతస్థునీ అంచనా వేసుకుంటారు. అదీ ఆచా రంలోని ఆంతర్యం! ఆ సాంప్రదాయాన్ని పాటించాలి!"

తల్లి మొండి పట్టుదలకి ఆవేశపడింది సుజాత.

"పోనీ దాన్ని నా యింటికి తీసుకువెళ్లా లనుకుంటున్నా! ఓ వారం రోజులుంచుకొని తిరిగి పంపిస్తా! తీసుకెళ్లమంటావా?" ఆగ్ర హాన్ని అణచుకొంటూ అడిగింది సుజాత.

అనంగీకారాన్ని వ్యక్తం చేస్తూ మౌనం వహించింది తల్లి. మర్నాడుదయమే మా తిరుగు ప్రయాణం! ఆ రాత్రి భోజనం చేసి వీధి వరండాలో వాలుకుర్చీ లో కూర్చున్నా. నేను ఏకాంతంగా వుండటం చూసి, నా వెనుకనే గుమ్మంలో నిలబడి అంది సుగుణ.

"బావగారూ! నేను ఎప్పుడూ రాజ మండ్రి చూడలేదు! అక్క రమ్మంటోంది!" తన సంసిద్ధతను తెలియజేసింది. వెనక్కి తిరిగి ఆమె మొహంలోకి చూసా! లైటు వెలుగులో స్పష్టంగా కనిపించింది. పది సంవత్సరాల క్రితం నా పెళ్లినాటికి ఆమె వయసు పద హారు సంవత్సరాలు! అదే వయసులో వున్న మాచెల్లెలికి ముగ్గురు పిల్లలు! ఆమె సిగ్గుతో తల దించుకొంది.

ఆమె కళ్లలో-

అందరిలా తనూ పెళ్లికూతురు కావా లన్న కోరిక!

ఒకరికిల్లాలినై తన యింటిని దిద్దుకోవా లన్న తపన!

కన్నెచెర విడిపించమని అభ్యర్థన! ప్రార్థన!

వెనుకనుండే వస్తూ అంది సుజాత.

"అమ్మమాటకేం! దీన్ని మనతో తీసు కెళ్దాం!" తన నిర్ణయాన్ని తెలియజేసింది. ఎలాగైతేనేం! సుగుణని మాతో రాజమండ్రి తీసుకెళ్లాం! పెళ్లిచూపులు ఏర్పాటు చేశాం "పిల్ల నచ్చింది! చేసుకొంటాం!" అన్నారు. పెళ్లికొడుకు అన్నయ్య నా కొలీగ్! 'బాగా సన్నిహితుడు! అతి కష్టంమీద చొరవ తీసుకొని ఆరు వేలు కట్నానికి అంగీకరింపచేసాను. ఇక తర్వాత చేయవల్సింది నామీద పడింది. భాస్కరాన్నీ, కృష్ణనీ ఒకేసారి రప్పించడం బహు కష్టం అయింది. అంతా కూర్చుని పెళ్లికి ఎంత ఖర్చు అవుతుందో లెక్కలు వేశాం! పది వేలకి తేలింది. ఆ ఖర్చుని ఇద్దరన్నదమ్ముల్ని పంచుకోమంది అత్తయ్య గారు. కొడుకు లిద్దరూ తెల్లమొహం వేశారు.

"ఈ గడ్డు రోజుల్లో సంసారం గడవడమే కష్టంగా వుంది! మాదగ్గరంత డబ్బులేదు!" అన్నారిద్దరూ ఏక కంఠంతో. వారలా అంటా రని నాకు తెలుసు! వేరొక మార్గం ఆలో చించి వుంచా! సుజాతకి చెప్పాను కూడా! ఆమె తల్లికి చెప్పింది కాబోలు!

"మన యింటి పక్కనున్న రెండువం దల గజాలూ అమ్మేద్దాం! ఎలా లేదన్నా ఇర వై వేలొస్తాయ్! లక్ష్మి పెళ్లిక్కూడా డబ్బు కావాలి కదా!" అంది తల్లి.

అన్నదమ్ములిద్దరూ అసమ్మతిని తెలియ జేశారు. ఏకగ్రీవంగా ఆ ప్రతిపాదనను త్రోసిపుచ్చారు.

"వద్దమ్మా! నాన్నగారు రెక్కలు ముక్కలు చేసుకొని కొన్న జాగా అది! అందులో ఇల్లు కట్టాలనుకొంటున్నాం!" అన్నాడు పెద్ద కొడుకు భాస్కరం.

"అంత కట్నం ఇచ్చుకోలేం! ఇద్దరు పిల్ల లకు పెళ్లిళ్లు చేయాలి! మరో సంబంధం


Kurlopillo తలగడలు

మృదు వెచ్చని సుఖకరం



ఎర్రదుమైన కలం తలగడలు - ఆకట్టుకొనే రెండ రకాలు డ్రీమ్‌ల్యాండ్ మరియు కల్పన మీ అగత్యమునకు అభిరుచికి తగినది

కర్ల్-ఆన్ పరుపులు తయారించువారిచే

కర్నాటక కన్స్యూమర్స్ ప్రొడక్ట్స్ లి:
ఏరియా సేల్స్ ఆఫీసు మరియు షోరూము: 3.4.709
నారాయణగూడ, హైదరాబాదు - 27, ఫో: 66561:, 1.2.524/3 సాగర్‌వ్యూ
దోమలగూడ, హైదరాబాదు — 29, ఫో: 234560; 25-31-3, వాడవీధి,
విశాఖపట్నం - 1, ఫో: 65448; 10/5/138 A6, టి.కె. వీధి, తిరుపతి - 1, ఫో: 22235.

"చూసుకొందాం!" ద్వితీయ పుత్రుని ప్రతిపాదన.

అన్నయ్యల మాటలు సుజాతకు చిర్రెత్తించాయ్!

"మరెలా అవుతాయిరా చెల్లెళ్ల పెళ్లిళ్లు! మీ పెళ్లాలూ, పిల్లలూ మీ గొడవేగానీ తల్లీ చెల్లెళ్లూ, తమ్ముడు ఎలా బతుకుతున్నారని ఎప్పుడైనా ఆలోచించారా? వేలకు వేలు జీతాలు తెచ్చుకుంటున్నారు, ఇద్దరు, ముగ్గురు పిల్లలు! మీకే యిబ్బందులుంటే ముష్టి మూడొందలతో ఈ నలుగురూ ఎలా బతుకుతారనుకొంటున్నార్రా? మనల్ని కన్నవారినీ, నమ్ముకొన్నవారినీ ఆదుకోవాలన్న జ్ఞానం మీకుందా? ఉత్తరాలు రాయగా రాయగా ఏ మూణ్ణెల్లకో ఓ వందో యాభైయ్యో పారేస్తారు ముష్టివేసినట్టుగా! పాతికేళ్లు దాటాయ్. చెల్లికి పెళ్లి చేయాలన్న జ్ఞానం మీకుందా? అసలు వీళ్లు మీకు జ్ఞాపకానికి వస్తారా? పది రూపాయలు పెట్టి జాకెట్టు గుడ్డ కూడా కొనని మీరు పదివేలు పెట్టి పెళ్లి చేస్తారని అనుకోవడం వట్టి అవివేకం రా!"

వుద్రేకంతో వూగిపోయింది సుజాత.

"అక్కా!" భయంతో వారించబోయింది ఆఖరి చెల్లి లక్ష్మి! సుజాతకి ఆవేశం ఏ మాత్రం తగ్గలేదు.

"అవును లక్ష్మీ ! నీ అక్కకే దిక్కులేదు ! నీ సంగతెవరు పట్టించుకుంటారు? నా మాట విని ఓ బుద్ధిమంతుణ్ణి చూసుకుని వాడితో లేచిపో ! అమ్మలక్కలూ, చుట్టాలూ నాలుగు రోజులు గుసగుసలాడుకుంటారు. అయినా పరవాలేదు. నీ బతుకు నువ్ చూసుకో ! నీ అక్కకిది చేతగాదు!" తానేమి మాట్లాడుతున్నదీ తెల్సుకోలేని స్థితికి చేరుకుంది సుజాత. ఆ అన్నదమ్ములిద్దరూ పెదవి కదపకపోవటం నాకాశ్చర్యం వేసింది. సుగుణ కళ్లు చెమర్చాయ్. అత్తయ్యగారు కొంగుతో కళ్లు తుడుచుకొంది. అన్నదమ్ముల మనసు కరగలేదు ! సుగుణకి ఆసంబంధమూ తప్పిపోయింది.

* * * *

నే వెళ్లేసరికి శంకరం ఇంట్లో లేడు. సుగుణ మంచానికి అతుక్కుపోయి వుంది. చెల్లెలి నోట్లో టాబ్లెట్స్ వేస్తోంది సుజాత. వెళ్లి మంచానికి దగ్గరగా నిలబడ్డా. నన్ను చూసి పేలవంగా నవ్వు మొహం పెట్టింది సుగుణ. శక్తిని కూడదీసుకుని రెండు చేతులు జోడించి నమస్కారం చేసింది.

"నే పోతున్నా !" అన్నట్లు సైగ జేసింది. కన్నీరు చెంపల ద్వారా కిందికి ప్రవహిస్తోంది. నా హృదయం ద్రవించింది. కళ్లు చెమ్మగిల్లాయ్. ఆమె నుదురు మీద చేయివేసి లాలనగా చూస్తూ...

"లేదు సుగుణా ! బతుకుతావ్ ! అధైర్యపడకు !" నాలో ధైర్యం పూర్తిగా సడలిపోయినా ఆమెకు ధైర్యం చెప్పా.

"నూటనాలుగు జ్వరం ! మరి తగ్గలేదు !" అంది సుజాత కన్నీరు తుడుచుకుంటూ. అంతలో గదిలోకి వస్తూ చెప్పింది అత్తయ్యగారు.

"వెంకట్రావు డాక్టరుగారు రోజూ రెండు పూటలా వస్తూ చూస్తున్నారు బాబూ ! గుణం కనబట్టంలేదు. రెండు రోజులనుంచీ చెరుపుమరుపుగా వుంటోంది ! అన్నయ్యలకీ, నీకూ టెలిగ్రాంలు పంపాడు శంకరం !"

"కె. జి. హాస్పిటల్లో జాయిన్ చేసి ఉండాల్సింది !" అన్నా. అంతలో డాక్టరు వెంకట్రావుగారిని తీసుకొని వచ్చాడు శంకరం. సుగుణను పరీక్షించి ఇంజక్షన్ చేశారు. కొన్ని క్యాప్సూల్స్ ఇచ్చి, పూటకి రెండు చొప్పున వేయమని చెప్పారు. ఆయన వెళ్తూంటే వెనకనే వెళ్లి వీధిలో అడిగాం.

"డాక్టర్ ! క్షమించాలి ! మీ మీద నమ్మకం లేక కాదు. మరోలా అనుకోకండి ! పేషెంటుని కె. జి. హెచ్. కి తీసుకెళ్లాలనుకుంటున్నా !"

"మీ ఇష్టం !" అంటూ రిక్షా ఎక్కారు డాక్టరుగారు.

సుగుణని వెంటనే పెద్దాస్పిటల్ కి తీసుకెళ్లాం టాక్సీలో. వెంటనే అడ్మిట్ చేసుకున్నారు. మూడు రోజులు గడిచాయ్. రోగి పరిస్థితి మరింత క్షీణించసాగింది. డాక్టరు శక్తివంచన లేకుండా ఆమెను బ్రతికించడానికి ప్రయత్నిస్తున్నారు. ఫలితం కనిపించడం లేదు. సుగుణకి మాట పడిపోయింది. ఆమె ముక్కుకి పెట్టిన ఆక్సిజన్ ట్యూబ్ ని సరిచేస్తూ అంది సుజాత భయంగా-

"అన్నయ్యలింకా రాలేదు !"

"ఎందుకక్కా ! వచ్చి మాత్రం ఏం చేయగలరు ?" శంకరం మాటల్లో కోపం, విసుగు ! నాకూ అలాగే అనిపించింది.

అంతలో ఒక సిస్టర్ వచ్చి నన్ను పిలిచింది.

"మాస్టారూ ! మిమ్మల్ని చీఫ్ రమ్మంటున్నారు !" సిస్టర్స్ రూమ్ లో వున్నారు చీఫ్. వెళ్లి నమస్కరించి ఎదురుగా నిలబడ్డా. "కూర్చోండి" అన్నారు ఏదో పేషెంట్ ఈ సీజీ పరీక్షిస్తూ. నేను కూర్చోలేదు. ఏమి చెబుతారో అన్న భయం.


"ఆ పేషెంట్ మీకేమౌతారు ?" అడిగాడు. చెప్పాను.

"అతను ఆమె తమ్ముడా ?" అవునన్నట్లు తలూపాను. ఆయన ఒక్క క్షణం మాట్లాడలేదు. నేనే మాట్లాడా.

"ఇద్దరన్నయ్యలు కూడా ఉన్నారు. దూరంగా ఉద్యోగాలు చేస్తున్నారు. టెలిగ్రామ్స్ పంపాం ! వస్తారు !"

ఆయన కళ్లనిండా సానుభూతి కన్పిస్తోంది.

"అయాం సారీ మిస్టర్ ! ఆమె పరిస్థితి బాగులేదు. ఇంటికి తీసుకెళ్లటం మంచిదని నా అభిప్రాయం! తర్వాత ఇబ్బంది పడ్తారు ! చాలా ఆలస్యంగా తీసుకొచ్చారు!" అన్నారు.



# మీ జి.కె. ఎంత?

(1) మొట్టమొదటిసారిగా స్పేస్‌షటిల్ పేరేమిటి?
(2) క్రెమ్‌నోఫోబియా అంటే ఏమిటి?
(3) "కాంగెరికెట్ నార్గే" అనేది ఏదేశం యొక్క జాతీయ లేక అధికారిక నామము?
(4) 'ఆస్కార్‌బిక్ ఆసిడ్'ని మనము సాధారణంగా ఏ పేరుతో పిలుస్తున్నాము?
(5) ఇంగ్లాండ్‌రాణి పాస్‌పోర్ట్ నంబర్ ఎంత?
(6) కోటీశ్వరులకే కోటీశ్వరుడు "సుల్తాన్ ఆఫ్ బ్రూనై" పేరేమిటి?
(7) 'భారత నావికాదళం'లోని మొదటి 'జలాంతర్గామి' పేరేమిటి?
(8) కేవలం 8 నిమిషాలు నటించి 'ఉత్తమ సహాయ నటుడి'గా ఆస్కార్ పొందిన నటుడెవరు?
(9) 1988 సంవత్సరానికి 'లతామంగేష్కర్' అవార్డు ఎవరికి లభించింది?
(10) "భారత రత్న" పొందిన మొదటి విదేశీ వ్యక్తి ఎవరు?

-జై

జవాబులు ఈ సంచికలోనే

## "కథ కాని కథ"

"తర్వాత" అంటే అర్థం అయింది. నాలోని నవనాడులూ కృంగిపోయాయి. పక్కనేవున్న బల్లమీద చతికిలబడ్డా ! అపస్మారక స్థితి దాదాపు అలముకొంది. అలా ఎంతసేపు కూర్చున్నానో తెలీదు. శంకరం వెన్నుతట్టి లేపి చెప్పాడు.

"బావగారూ ! అన్నయ్యలూ, ఒదినలూ వచ్చారు !" అని. లేచి నిలబడ్డా. డాక్టరుగారక్కడ లేరు. బెడ్ చుట్టూ అన్నయ్యలూ, ఒదినలూ నిలబడి సుగుణని పరీక్షగా చూస్తున్నారు.

"డాక్టరుగారేమన్నారు ?" దుఃఖాన్ని దిగమింగుకుంటూ అడిగింది సుజాత. జవాబు చెప్పలేక మౌనం వహించా. భాస్కరాన్నీ, కృష్ణనీ వరండాలోకి తీసుకెళ్లా, శంకరం కూడా వచ్చాడు. డాక్టరుగారు చెప్పింది చెప్పా.

"నో ! అలా జరగడానికి వీల్లేదు ! డాక్టరుగారితో మాట్లాడ్దాం" అన్నారు ఉద్వేగంగా. తర్వాత చీఫ్ ఉండే రూమ్‌వైపు నడిచారు. నేనుకూడా వెనుకనే వెళ్లా.

"మా చెల్లి తప్పకుండా బ్రతకాలి డాక్టర్ !" అన్నాడు కృష్ణ.

"ఎంత ఖర్చయినా భరిస్తాం !" చెప్పాడు భాస్కరం.

పరీక్షిస్తున్న ఎక్స్‌రేని పక్కకుపెట్టి ఆ ఇద్దర్నీ పరీక్షగా చూశారు డాక్టర్‌గారు. పక్కనే వున్న నన్ను చూసి వారెవరైనదీ అర్థం చేసుకొన్నారు. డాక్టరుగారి చూపుల్లో చికాకు ! సానుభూతి ! నిస్సహాయత !

"అయాం సారీ ! మీ బావగారితో చెప్పా ! అలా చేయటం మంచిదేమో అనిపిస్తోంది !" అన్నారు అతిసౌమ్యంగా.

"లేదు డాక్టర్ ! ఆమెని బతికించాలి !"

"ఖర్చుకి వెనకాడం ! ఎంతయినా భరిస్తాం !"

ప్రాధేయపడ్డారిద్దరూ. అతి శాంతంగా చెప్పారు డాక్టరుగారు.

"రోగి ప్రాణాన్ని డబ్బు కాపాడలేదు. మందులు మాత్రమే అపాయాన్నుండి రక్షిస్తాయ్ ! అదయినా సరైన సమయంలో అయితేనే ! చెల్లెలిమీదున్న ప్రేమకొద్దీ వేలూ, లక్షలూ ఖర్చుపెట్టడానికి మీరు సిద్ధపడి ఉండొచ్చు. కానీ చాలా ఆలస్యం అయింది. నాలుగు రోజులు ముందు తీసుకొని వచ్చి వుంటే పరిస్థితి ఇలా ఉండేది కాదు. రోగి ప్రాణాలు పోయేంతవరకూ అంటే ఆఖరి క్షణం వరకూ మా ప్రయత్నాలు మేము చేస్తాం ! అది మా విధి ! కర్తవ్యం కూడా ! తర్వాత మీ అదృష్టం ! నాకు తోచింది చెప్పా ! తర్వాత మీ ఇష్టం !"

అన్నదమ్ములు ముగ్గురూ నిశ్చేష్టులయ్యారు. డాక్టరుగారు ఎక్స్‌రేతో బయ్యటకు వెళ్తూంటే వెనుకనే వెళ్లి "డాక్టర్ !" అన్నా.

ఆయన వెనక్కి తిరిగి చూసి - "మీరు పేషెంట్ బావగారు కదూ ?" అడిగారు. తలూపాను.

"నా అంచనా ప్రకారం ఆ పేషెంట్ నాలుగైదు గంటల కన్నా ఎక్కువ కాలం బ్రతకదు. అంటే తీసుకొని పొమ్మని బలవంతం చేస్తున్నానని మాత్రం భావించకండి ! ప్లీజ్ ! వారు ఆర్థిక ఇబ్బందుల్లో వున్నట్లు కన్పిస్తున్నారు. తర్వాతయ్యే ఖర్చుని దృష్టిలో ఉంచుకొని మాత్రమే ఆ సలహా ఇచ్చాను. మళ్లీ మరొక పావుగంటలో వచ్చి చూస్తా ! పేషెంట్‌ని వదిలి ఎక్కడికీ వెళ్లకండి !"

అడుగులు పడలేదు. రక్కున ఆగిపోయా.

సుగుణని వెంటనే టాక్సీలో ఇంటికి తీసుకెళ్లాం. డాక్టరుగారు చెప్పినట్లే జరిగింది. ఇంటికి తీసుకెళ్లిన ఒక గంటకి సుగుణ ప్రాణం అనంతవాయువుల్లో కలిసిపోయింది.

చెల్లెల్ని కాటికి సాగనంపటానికి ఘనంగా ఏర్పాటు చేశారు అన్నదమ్ములిద్దరూ. ఆరు వందలు పెట్టి పట్టుచీర కొన్నారు. కూతుర్ని కాటికి తీసుకెళ్తుంటే భోరున ఏడ్చింది తల్లి. ఆమె వెనుక ఆడపిల్లలూ, కోడళ్లూ. ఆ ముగ్గురన్నదమ్ములూ, నేనూ శ్మశానం నుండి ఇల్లు చేరుకొన్నాం.

గుమ్మంలో ఉన్న తల్లి అడిగింది రోదిస్తూ-

"చెల్లెల్ని అత్తవారింటికి పంపారా ? ఏ లోటూ చేయలేదు కదా !" పిల్లలు ముగ్గురూ మౌనంగా తలలు వాల్చారు. ఆమె నావైపు తిరిగింది.

"బాబూ ! దగ్గరుండి మరదల్ని అత్తవారింటికి దిగబెట్టావ్ కదూ! నాకు తెల్సు ! ఏలోటూ జరగనీయవ్ !"

ఆమెకు మతిభ్రమణం కలిగిందేమోనన్న అనుమానం వచ్చింది. ఆ మాతృ హృదయాన్ని ఎలా ఊరడించడం ? ఆ కడుపు మంటని ఎలా చల్లార్చటం ? ఎవరికి చేతనవుతుంది ? సమాధానం చెప్పలేక వీధి అరుగుమీదనే చతికిలబడ్డా.

ఇది కల్పన కాదు ! జరిగిన కథ ! కథ కాని కథ ! జరగకూడని కథ ! కానీ జరుగుతూన్న కథ ! ●